

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
శుక్రవారం 10 జనవరి 2025



ప్రొద్దుటూరు కేంద్రంగా..
ఫోర్జరీ గ్యాంగులు



వ్యాపార వాణిజ్య రంగాలకు కేంద్రమైన ప్రొద్దుటూరు.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలకు నెలవుగా మారింది. కొందరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా పెద్ద ఎత్తున అక్రమాలు సాగిస్తున్నారు. వీరికి కొందరు డాక్యుమెంటు రైటర్లు సహకారం అందిస్తున్నారు. వీటిని చట్టబద్దంగా మార్చడానికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కొందరు కరెప్షన్ కింగ్‌లైన అధికారులు లింకు డాక్యుమెంట్లు లేకున్నా రెవెన్యూ అధికారులు ఇచ్చినట్లు ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్లను, ఫేక్ ఆధార్‌లను పెట్టి అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారు. వీరి ప్రోత్సాహంతో ప్రొద్దుటూరులో వైసీపీ పాలనలో ఫోర్జరీ గ్యాంగులు చెలరేగిపోయాయి. అవి ఫోర్జరీ సర్టిఫికెట్లు, అక్రమ రిజిస్ట్రేషన్లని బయటపడ్డాక... కూటమి ప్రభుత్వంలో వాటిని రద్దు చేయించే పనులకు సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



ప్రొద్దుటూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమే అడ్డా
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై కన్ను
- డాక్యుమెంటు రైటర్లే సూత్రధారులు
- నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లు, నకిలీ ఆధార్‌లతో రిజిస్ట్రేషన్లు
- వైసీపీ పాలనలో సాగిన నయా దందా

ప్రొద్దుటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం, కొత్తపల్లె, చౌటపల్లె పంచాయతీలలో ఫోర్జరీ గ్యాంగులు అక్రమాలు సాగిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో ఆంధ్రజ్యోతి ఈ ఫోర్జరీ గ్యాంగుల బాగోతాన్ని వెలుగులోకి తెచ్చింది.

● కొత్తపల్లె పంచాయతీ సర్వేనెంబరు 297లోని 316, 317 ప్లాట్ల స్థల యజమాని సన్నుతి చిన్నపుల్లయ్య మరణించారు. అయితే జిన్నారోడ్డుకు చెందిన ఓ వృద్ధుడికి సన్నుతి చిన్నపుల్లయ్య అని ఫేక్ ఆధార్ సృష్టించారు. 2024 జనవరి 6న డాక్యుమెంట్ నెంబరు 290/2024 పేర షేక్ మునిఫ్ అనే వ్యక్తికి దాదాపు రూ.40 లక్షల విలువ చేసే ఈ రెండు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారు. అయితే నాడు సన్నుతి చిన్నపుల్లయ్య బంధువులు సమాచారం తెలుసుకుని వెంటనే ప్రజాప్రతినిధి సోదరుడి వద్ద పంచాయితీ పెట్టి జనవరి 18 తేదీన తిరిగి 290 /2024 డాక్యుమెంటును పరస్పర అంగీకారం మేరకని చెప్పి 721/ 2024 ద్వారా రద్దు చేసుకున్నారు.

● 2023 డిసెంబరు 23న కొత్తపల్లె పంచాయతీ మోడమీదిపల్లె పొలం సర్వేనెంబరు 201లోని ఎన్జీవో కాలనీ ప్లాట్ల నెంబరు 171ని మరో ఫోర్జరీ గ్యాంగు అక్రమ రిజిస్ట్రేషన్ చేసింది. దాదాపు రూ.కోటి విలువ చేసే 7.5 సెంట్ల విస్తీర్ణం ఉన్న ఈ ఆస్తిని అక్రమంగా కాజేయడానికి యత్నించారు. ఈ ప్లాట్ యజమాని కిదంబి అనంతాచార్యులు చాలా కాలం క్రితం మరణించారు. 171 ప్లాట్లో ఒక పాత బిల్డింగ్ ఉంటే దానిని కూల్చి మరీ కిదంబి అనంతాచార్యుల పేరుతో ఎర్రగుంట్లకు చెందిన సుందరయ్య కాలనీ డోర్‌నెంబరు 1/17-1 గల ఇంటిలో నివాసం ఉంటున్న వ్యక్తికి ఫేక్ ఆధార్ సృష్టించి ఎర్రబల్లే గ్రామానికి చెందిన ఆదిబోయిన గంగయ్య(40)కు 23 డిసెంబరు 2023న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై అనంతాచార్యుల కుమారులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆమేరకు రూరల్ పోలీసు స్టేషన్లో కేసు కూడా నమోదు చేశారు. ఈ వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు.

● రిటైర్డ్ ఉద్యోగి గుర్రం జనార్దన్ రావు భార్య రాజేశ్వరి కొత్తపల్లె పంచాయతీ సర్వే నెంబరు 194లో 263 ప్లాట్ నెంబరుగల ఏడున్నర సెంట్ల స్థలాన్ని 1985 ఏప్రిల్ 25న కోడి మునీశ్వర్ నుంచి కొనుగోలు చేశారు. ఈ భూములు ఎన్జీవో హౌస్‌బిల్డింగ్ సొసైటీకి సంబంధించినవి. ఈ ఆస్తిని 2024 మార్చి 22న గుర్రం జనార్ధన్‌రావు విక్ర యించినట్లుగా స్థానిక కోనేటికాల్వ వీధికి చెందిన షేక్ మిట్టపల్లి అర్షద్ అనే వ్యక్తికి రూ.36లక్షల 30వేలకు విక్రయించారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై కూడా రూరల్ పోలీసు స్టేషన్లో జనార్ధన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదయింది. ఇప్పటి వరకు ఈ కేసుల్లో ఏ ఒక్కరిని పోలీసులు అరెస్టు చేయలేదు.

● గోపవరం పంచాయతీ ద్వారకానగర్ ప్రొద్దుటూరు పొలం 257, 259/1లలో మాజీ ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అయిన పాణ్యం ఎర్రమునిరెడ్డికి 26 సెంట్ల స్థలం ఉంది. దీనిని కొందరు నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లతో రెండు సెంట్ల వంతున 13 మందికి అక్రమంగా 2023లో విక్రయించారు. ఇవన్నీ సబ్‌రిజిస్ట్రార్లు విద్యాసాగర్, రామలక్షుమ్మ, రత్నమ్మల హయాంలో జరిగాయి. మొత్తం 13 డాక్యుమెంట్లపై మాజీ ఎమ్మెల్యే పాణ్యం ఎర్రమునిరెడ్డి కుటుంబీకులు రూరల్ పోలీసులకు, సబ్‌రిజిస్ట్రార్‌కు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు గత ఏడాది జనవరి 28లోనే అవి ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్లుగా తేల్చి నివేదిక ఇచ్చారు. దీంతో పోలీసులు ఆ 13 మందిని విచారించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ డాక్యుమెంట్లు రద్దు చేసుకోకపోతే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. దీంతో వీరంతా ఇటీవల తమ డాక్యుమెంట్లను రద్దు చేసుకుని 26 సెంట్ల స్థలానికి క్లియరెన్సు ఇచ్చారు. వైసీపీ హయాంలో సాగిన ఈ దందాకు సంబంధించి కూటమి ప్రభుత్వంలో బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

కూటమి చెక్ పెట్టేనా..

వైసీపీ ఐదేళ్ల పాలనలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కేంద్రంగా ఫోర్జరీ గ్యాంగులు రెచ్చిపోయాయి. వీటికి అప్పటి సబ్‌రిజిస్ట్రార్లు సహకరించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుని వెళ్లారు. కొందరు ఏకంగా అప్పటి ప్రజాప్రతినిధికి భారీగా ముడుపులు ఇచ్చి పెద్దమొత్తంలో చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. వారిలో ఒక్క రామలక్షుమ్మ మాత్రమే సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇంకా కొందరు సబ్‌రిజిస్ట్రార్లపై విచారణ జరిపితే వారిపై వేటు పడకతప్పదని అంటున్నారు. ఇలాంటి అక్రమాలకు సూత్రధారులుగా ఉన్న డాక్యుమెంటు రైటర్లపై కేసులు పెట్టాలని, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వారి ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. కార్యాలయ ఆవరణలోగాని లోపల గానీ సీసీ కెమెరాలు అమర్చాలని అంటున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించి ఇలాంటి ఫోర్జరీ గ్యాంగులను జైల్లో వేయాలని ప్రజలు కోరుతున్నారు.


నారుగండ్ల కొండయ్యకు చెందిన ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్



వాటిని రద్దు చేయిస్తున్నాం..

ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్లతో రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లను బాధితుల ఫిర్యాదు మేరకు గుర్తించి వాటిని రద్దు చేయిస్తున్నాం. మాజీ ఎమ్మెల్యే పాణ్యం ఎర్రమునిరెడ్డికి చెందిన ఆస్తిని అక్రమంగా రిజిస్టర్ చేయించుకున్న వారి నుంచి డాక్యుమెంట్లను రద్దుచేయించాం. అలాగే కొత్తపల్లె పంచాయతీలో చనిపోయిన వ్యక్తుల పేర్లమీద ఫేక్ ఆధార్‌లతో రిజిస్టర్ అయిన వాటిపై కూడా చర్యలు తీసుకున్నాం. గతంలో ఈ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల కారణంగా అధికారులందరికీ చెడ్డపేరు వచ్చింది. భవిష్యత్తులో అలాంటి అక్రమాలకు తావులేకుండా అన్ని డాక్యుమెంట్లు పరిశీలించాకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం.

- రామదాసు, సబ్‌రిజిస్ట్రార్, ప్రొద్దుటూరు

నేటి నుంచి సంక్రాంతికి
1,147 ప్రత్యేక బస్సులు

కడప మారుతీనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ కడప జోన్ పరిధిలోని రాయలసీమ జిల్లాల్లోని డిపోల నుంచి సుమారు 1,147 ప్రత్యేక బస్సులను అధికారులు సిద్ధం చేశారు. ఇవి శుక్రవారం నుంచి 13వ తేదీ సోమవారం వరకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు ప్రాంతాల నుంచి ఆయా జిల్లాలకు ప్రయాణికులను చేరవేయనున్నాయి. ఇందులో కడప రీజియన్ పరిధిలో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల డిపోల నుంచి 294 బస్సులు ఏర్పాటుచేశారు. ఇందులో హైదరాబాద్ నుంచి కడప జిల్లాకు 111 బస్సులు, బెంగళూరు నుంచి 81, చెన్నై నుంచి 12, విజయవాడ నుంచి 25 బస్సులు తిరగనున్నాయి. వీటితో పాటు తిరుపతి, కర్నూలు, నెల్లూరు నుంచి మరో 65బస్సులు తిరగనున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లా నుంచి 60బస్సులు ఏర్పాటుచేశారు. ఇందులో హైదరాబాద్ నుంచి అన్నమయ్య జిల్లాకు 9, బెంగళూరు నుంచి 42, చెన్నై నుంచి 2, విజయవాడ నుంచి 7 బస్సులు సిద్ధం చేశారు.

నంద్యాల జిల్లా పరిధిలో 112 బస్సులు, కర్నూలు జిల్లా నుంచి 170, తిరుపతి జిల్లా నుంచి 178, చిత్తూరు జిల్లా నుంచి 82, సత్యసాయి జిల్లా నుంచి 115, అనంతపురం జిల్లా నుంచి 136 బస్సులు కేటాయించారు. వీటితో పాటు బెంగళూరు నుంచి 56, చెన్నై నుంచి 2, విజయవాడ నుంచి 17, ఇతర ప్రాంతాల నుంచి మరో 6 బస్సులు ప్రయాణికుల కోసం కేటాయించారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సాగించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

రిమ్స్ కళాశాలకు అరుదైన ఘనత

కడప సెవెన్ రోడ్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ మెడికల్ కళాశాలకు అరుదైన ఘనత లభించింది. 'ఇన్‌స్టిట్యూట్ ఎథికల్ కమిటీ, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌'గా సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ న్యూఢిల్లీ నుంచి గుర్తింపు పత్రాన్ని పొందింది. దీని వల్ల అకడమిక్ రీసెర్చ్ ఆక్టివిటీస్ మరింత అభివృద్ధి చెందుతాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ఎథికల్ కమిటీ రిజిస్ట్రేషన్ అనేది చాలా కొద్ది కళాశాలలకు మాత్రమే లభించే అరుదైన గుర్తింపు అన్నారు. కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు ఈ ప్రయోజనాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా సూచించారు. కమిటీ ఏర్పాటుకు కృషిచేసిన అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డిని అభినందించారు.

నేడు వైకుంఠ ఏకాదశి


దేవునికడపలో చేసిన ఏర్పాట్లు

కడప కల్చరల్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే పలు ఆలయాలలో భక్తుల కు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. ఈ మేరకు ఆలయాలలో ఏర్పాట్లు చేశారు. దేవునికడప ఆలయంలో 150మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరిశ్రమలతో జిల్లా ప్రగతి

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

సికెదిన్నె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఇండస్ట్రియల్ మీటింగ్ హాలులో గురువారం నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, అదేవిధంగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టాలని అనుకునేవారికి ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించే విధంగా బ్యాంకులు సహకరించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. అంతకు ముందు కలెక్టర్ కొప్పర్తి పారిశ్రామికవాడలోని అన్ని పరిశ్రమల యూనిట్లను, ఆధునిక వసతులతో నిర్మించిన ఇండస్ట్రియల్ గెస్ట్‌హౌస్‌ను పరిశీలించారు. సమావేశంలో కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, తహశీల్దారు నాగేశ్వరరావు, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాషా, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఎల్‌డీఎం జనార్ధన్, లేబర్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌నాయక్, ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి, ఏపీఐఐసీ ప్రతినిధులు, డిక్కి, సిక్కి జిల్లా కోఆర్డినేటర్లు శివశంకర్, జ్ఞానప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


కొప్పర్తిలోని పరిశ్రమలను సందర్శించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు

వెంచర్లు వేసుకోవాలంటే.. ఎమ్మెల్యేకు కప్పం కట్టాలి

● మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో వెంచర్లు వేసుకుని ప్లాట్లను అమ్ముకోవాలంటే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డిలకు కప్పం కట్టాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. గురువారం దొరసానిపల్లెలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురం పొలంలో వైసీపీ నాయకుడు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి 29 ఎకరాల్లో వెంచర్ వేశాడన్నారు. ఇది రికార్డు ప్రకారం చెరువని చెప్పి ఆ భూమి ల్యాండ్ కన్వర్షన్ కానివ్వకుండా ఎమ్మెల్యే అడ్డుకున్నాడన్నారు. అయితే అది చెరువు భూమి నుంచి 1923లోనే పట్టా భూమిగా మారిందని రెవెన్యూ అధికారులు అంటున్నారన్నారు. రూ.150 కోట్ల విలువ చేసే ఆ భూమిలో 10శాతం కమీషన్ ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రతిపాదన పెట్టారన్నారు. వరద నీటి కథల వెనుక అవినీతి కథలు దాగి ఉన్నాయన్నారు. సమావేశం లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, వైస్ ఛైర్మన్ ఖాజా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శివాలయం సమీపంలో అన్యాక్రాంతమయిన భూములు



ఆశ్రమం భూమి అన్యాక్రాంతం

● 80 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్

● ఫిర్యాదు చేసిన వారసుడు

ముద్దనూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని శివాలయం సమీపంలో ఉన్న చిద్గగగనానంద మహర్షి ఆశ్రమానికి చెందిన 80 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని మహర్షి వారసుడు భీంచెర్ల చిన్నవీరారెడ్డి రెవెన్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భూమిలో కంచె వేస్తుండగా రెవెన్యూ పోలీసులు అడ్డుకుని యంత్రాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. భీంచెర్ల చిన్నవీరారెడ్డి సమాచారం మేరకు..

జమ్మలమడుగు రోడ్డులోని వెంగమ్మ అనే భక్తురాలు దాదాపు 4.30 ఎకరాల భూమిలో శివాలయం నిర్మించింది. దానిని వెంగమ్మ సత్రం అంటారు. అక్కడే చిద్గగనానంద మహర్షి, ముద్దనూరుకు చెందిన కొంతమంది శిష్యులు ఉండేవారు. 1961లో ఆశ్రమం, గోశాల ఏర్పాటు చేయాలని భావించారు. జమ్మలమడుగు తహశీల్దారు వద్దకు వెళ్లి ఆశ్రమానికి భూమి కావాలని కోరగా ఆశ్రమం పేరుతో కుదరదని, వ్యక్తులకు భూమి ఇస్తామన్నారు. శిష్యుల పేరుతో ఒక్కొక్కరికి 5నుంచి 10 ఎకరాల భూమి పట్టా చేశారు. తరువాత శివభక్తురాలు వెంగమ్మ పేరున ఉన్న భూమితో పాటు శిష్యులకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని చిద్గగానంద మహర్షి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఇది దాదాపు 84 ఎకరాలు ఉంది. ఇందులో 60 ఎకరాల భూమి 1984 నుంచి 2019 వరకు అన్యాక్రాంతమయింది. మిగిలిన 24 ఎకరాలలో శివాలయం భూమి పోను ఉన్న 20 ఎకరాలు 2019 నుంచి 2021 మధ్యలో కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఈ భూములకు కొందరు కంచె వేస్తుండటంతో చర్యలు తీసుకోవాలని చిద్గగానంద మహర్షి వారసుడు భీంచెర్ల చిన్నవీరారెడ్డి అధికారులను ఆశ్రయించారు. దీనిపై ముద్దనూరు తహశీల్దారు వరదకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆశ్రమం భూమి 80 ఎకరాలు అన్యాక్రాంతం అయిందని ఫిర్యాదు అందిందని, అయితే 205-2, 5 సర్వేనంబర్లలో 20 ఎకరాలు అక్రమ రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలుస్తోందన్నారు. ప్రస్తుతం ఆ భూమిలో పనులు చేస్తున్న యంత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. విచారణ చేపట్టి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

● హెచ్చరించిన కలెక్టర్

కడప కలెక్టరేట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై కఠినచర్యలు తప్పవని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు అధ్యక్షతన గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, మాతా శిశు మరణాల నిర్మూలనపై జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడబిడ్డను రక్షించుకోవాలంటే ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా చూడాలన్నారు. గర్భస్రావాలు జరగకుండా ఆపాలని, అందుకోసం ప్రజల్లో విస్తృత ప్రచారం అవగాహన కల్పించాలన్నారు. ఇందులో అంగన్వాడీ వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు ప్రధాన భాగస్వామ్యం కల్పించాలన్నారు. గర్భస్థ శిశుమరణాలు అరికట్టడం ద్వారా లింగనిష్పత్తిలో అసమానతలు తొలగుతాయన్నారు. భ్రూణ హత్యల నివారణ కోసం పోలీసు శాఖ సహకారం కూడా తీసుకోవాలన్నారు. బాల్యవివాహాలు, మహిళా వివక్ష వంటి అంశాలపై కిశోర బాలికలకు కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జిల్లా సీనియర్ జడ్జి ఎస్.బాబాపక్రుద్దీన్, డీటీసీ డీఎస్పీ షేక్ అబ్దుల్, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీఈఓ మీనాక్షి, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు

- బిల్లుపైనే క్యూఆర్ కోడ్ ముద్రణ
- విద్యుత్ శాఖలో నూతన విధానం
- తొలి విడత కడప డివిజన్‌లో అమలు

7

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ● ఘనంగా అన్నమాచార్య సిల్వర్‌జూబ్లీ వేడుకలు



రాజంపేట/రాజంపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నేటి యువకులు ఉద్యోగాల కోసం చేయి చాచకుండా అనేకమందికి ఉద్యోగాలు కల్పించగలిగే పారిశ్రామిక వేత్తలుగా కష్టపడి ఎదగాలని, ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత డబ్బు సంపాదించినా నైతిక విలువలు కోల్పోతే అన్నీ కోల్పోయినట్లేనని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలిపారు. రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు గురువారం రాత్రి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మహిళలు ఎక్కడ అభివృద్ధి చెందుతారో అక్కడ అన్నివిధాలుగా అభివృద్ధి చెందినట్లేనన్నారు. ప్రధానంగా ఎంతో వెనుకబడ్డ రాయలసీమలో అందునా ఓ మారుమూల రాజంపేటలో అన్నమాచార్యుని పేరిట ఏకంగా ఒక యూనివర్సిటీని నెలకొల్పి ఏడాదికి పది వేల మందికి ఉన్నత విద్యను బోధిస్తున్న అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి కృషి అభినందనీయమన్నారు. అన్నిదానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. నేటి నూతన టెక్నాలజీకి అనుగుణంగా ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు పొంది విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నా తమ మాతృభూమి భారతదేశాన్ని మరువకుండా ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. బ్రహ్మానందం లాంటి గొప్ప హాస్యనటుడు మన తెలుగు రాష్ట్రాల్లో ఉండడం ఎంతో ఆనందదాయకమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నూతన విద్యా విధానానికి చేస్తున్న కృషి గేమ్ చేంజర్ లాంటిదని దీనివల్ల ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

కార్యక్రమంలో హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, సినీ హీరో కిరణ్ అబ్బవరం, రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి, హాస్యనటుడు ప్రదీప్‌కుమార్, ఎమ్మెల్సీ కె.శ్రీనాథ్‌చౌదరి, అన్నమాచార్య విద్యాసంస్థల ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బండారు దత్తాత్రేయను సత్కరిస్తున్న చొప్పా గంగిరెడ్డి, చొప్పా అభిషేక్‌రెడ్డి, బ్రహ్మానందం, కిరణ్ అబ్బవరం తదితరులు



ఏదీ సంక్రాంతి వైభవం..?

- ఇళ్ల ముందు కనిపించని రంగవల్లులు
- కానరాని గంగిరెద్దులు, హరిదాసులు
- నెలరోజుల నుంచి.. మూడు రోజులకే పరిమితమైన వేడుకలు
- పల్లెల్లో కనిపించని సంక్రాంతి సంబరాలు

కలెక్టరేట్‌లో ఫైళ్లు కదలడం లేదు

- మూలనపడ్డ దాదాపు 600 ఫైళ్లు
- వైసీపీ ప్రభుత్వంలో ఆదాయం వచ్చే ఫైళ్లకే ప్రాధాన్యం
- సాధారణ రైతుల ఫైళ్లన్నీ పక్కనే..
- 22ఏ, డాటెడ్ ల్యాండ్, ఫ్రీహోల్డ్ ఫైల్స్ పట్టించుకునే అధికారే కరువు..

వివరాలు...6లో

సంక్రాంతి సందెలో గొబ్బిళ్లో..
మమ్మేలు మాలక్ష్మీకి గొబ్బిళ్లో
నేడు మమ్మేలు మాలక్ష్మీకి గొబ్బిళ్లో
ముత్యాల ముగ్గున్న వాకిళ్లలోన
వసియించే మాసిరికి గొబ్బిళ్లో
మందారపూవన్నే పారాణిలోన
కొలువుదీరిన తల్లికి గొబ్బిళ్లో...

ఇలాంటి గొబ్బిళ్ల పాటలు నేటి సంక్రాంతి మాసంలో ఎక్కడా వినపడ్డం లేదు. సంక్రాంతి నెల ప్రారంభమై 20 రోజులు దాటుతున్నా గొబ్బిళ్ల పాటలు.. ఇంటిముంగిళ్లలో సంక్రాంతి ముగ్గులు.. గంగిరెద్దుల సవ్వళ్లు అసలే కనిపించడంలేదు. సంక్రాంతి వైభవం ఏటికేడాది తగ్గిపోతూ వస్తోంది.

ఏదీ సంక్రాంతి వైభవం..?

- ఇళ్ల ముందు కనిపించని రంగవల్లులు
- కానరాని గంగిరెద్దులు, హరిదాసులు
- నెలరోజుల నుంచి.. మూడురోజులకే పరిమితమైన వేడుకలు
- పల్లెల్లో కనిపించని సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి వస్తున్నా ఇళ్లకు వేసుకోని రంగులు


ఇళ్లముందు వేయని ముగ్గులు

రాజంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది పల్లెసీమల్లో ఘనంగా జరుపుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి. దీనిని వాడుక భాషలో పెద్దపండుగగా పిలుస్తారు. మన సంస్కృతి సంప్రదాయాలకు ఈ పండుగ కొత్తశోభను తెస్తుంది. సంక్రాంతి వచ్చిందంటే పిల్లలకు పది రోజులు, యువతులు మహిళలకు నెలరోజుల పండుగ. యువకులకు ఏకంగా పక్షం రోజుల పండుగ. సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులకు 10 రోజులు సెలవులు ఇస్తారు. తాడాట, బొంగరాలు, గోలీల ఆటలు ఇలా ఎన్నో రకాల ఆటలాడుకుంటూ ఎంతో సరదాగా విద్యార్థులు గడిపేస్తారు. మహిళలు, యువతులైతే డిసెంబరు 15 నుంచి జనవరి 15వ తేదీ వరకు ఈ పండుగను చేసుకుంటారు. తెల్లవారుజామునే ఇంటి ముంగిళ్లను శుభ్రం చేయడం, రంగురంగుల ముగ్గులు వేయడం, సంక్రాంతి తల్లిని ఆహ్వానిస్తూ ముగ్గులపై గొబ్బెమ్మ రూపంలో పేడ పెట్టి గుమ్మడిపూలతో అలంకరించడం చేస్తారు. నెలరోజుల పాటు సంక్రాంతి శోభను తెస్తారు.

యువతులందరూ ఒక్కటై గొబ్బెమ్మ పాటలతో నెలరోజుల పాటు ఊరందరిని అలరింపజేస్తారు. ఇక పురుషులైతే ఏదోకచోట కోడిపందేలు నిర్వహిస్తారు. ఏడాదిలో నెలరోజుల పాటు పెద్ద పండుగే. ఇదంతా పాతరోజుల్లో జరుపుకునే సంక్రాంతి. ఇప్పుడా కళ లేదు. నేటి కంప్యూటర్ యుగంలో అంతా సెల్‌ఫోన్ల మయమై సంక్రాంతి పండుగను జరుపుకునేవారే కరవయ్యారు. నెలరోజుల పండుగ కాదు కదా పట్టుమని మూడు రోజులు కూడా జరుపుకునేవారు లేకుం డాపోయారు. గొబ్బిళ్లు తట్టేవారే లేరు. ఇంటి ముంగిళ్లలో ముగ్గులు వేసే పరిస్థితి లేదు.

నేడు పల్లెల్లో కేవలం పండుగ చివరిరోజున గొబ్బెమ్మ పండుగ జరుపుకుంటున్నారు. యువతులు అందరూ చదువుకోవడం, చాలామంది ఉద్యోగాలు చేస్తుండడం, అసలు గొబ్బెమ్మ గొప్పతనాన్ని తెలుసుకోకపోవడం వల్ల గొబ్బెమ్మను తట్టేవారే లేకుండాపోయారు. పల్లెల్లో పశుసంపద కరువై ఇంటిముంగిళ్లలో పేడకల్లుతో చల్లే అలవాటులేకుండా పోవడంతో నెలరోజుల పెద్దపండుగ కాస్త మూడు రోజులకే పరిమితమైపోయింది. హరిజన, గిరిజన ప్రాంతాలు, ఉద్యోగులు, చదువుకున్నవారు తక్కువ ఉన్న ప్రాం తాలు, కుగ్రామాలు, అటవీ శివారు గ్రామాల్లో మాత్రమే ఈ సంక్రాంతి సంబరాలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లో అయితే సంక్రాంతి దాదాపు మరిచిపోయారేమో అనేలా మారింది.


హరిదాసు

మూడు రోజుల పండుగ విశిష్టత

పంటలన్నీ పండి ఇంటికి తీసుకువచ్చి ధాన్యంతో ఇళ్లు కళకళలాడే సమయంలో ఈ 3 రోజుల సంక్రాంతి పండుగను జరుపుకుంటారు. పండుగ ప్రధానంగా నెలరోజుల ముందే ప్రారంభమై ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో స్వాగతం పలుకుతారు. వేకువజామున హరిదాసుల పాటలు పాడుతారు. కోడిపందాలు, గంగిరెద్దులు, యెడ్ల పందాలు, ఒక్కమాటలో చెప్పాలంటే మన సంస్కృతి మొత్తం ఈ పండుగలో ప్రతిబింబిస్తుంది. అత్తిరాసాలు, కజ్జికాయలు, చక్కిలాలు, కారాలు, లడ్డూలు ఈ పండుగ ప్రత్యేక వంటకాలు. అది నాటి నుంచి నేటివరకు సాగుతోంది. తొలిరోజు భోగిపండుగ. ఆ రోజున వేకువజామునే భోగి మంటలు వేస్తారు. భోగిమంటల్లో పిడకలతో పాటు ఇళ్లలో ఉన్న పాత వస్తువులన్నింటినీ వేస్తారు. రెండో రోజు మకర సంక్రాంతి. ఆ రోజున ఇంట్లో చనిపోయిన పెద్దలను స్మరించుకుంటూ వారికి బట్టలు పెట్టుకోవడం ఆనవాయితీ. మూడోరోజున కనుమ పండుగ. దీనిని పసల పండుగ అని కూడా అంటారు. తమతో పాటు మమేకమై ఉండే పశువులకు కూడా స్నానాలు చేయించి అందంగా ముస్తాబు చేసి పశువుల పండుగను నిర్వహిస్తారు.

పట్టణాల్లోను, దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారు, బంధువుల ఆత్మీయులంతా తమ స్వగ్రామాలకు చేరుకుని ఎంతో సంబరంగా ఆత్మీయతానురాగాలతో కలిసి జరుపుకునే ఈ పండుగ ఉనికి రాను రాను తగ్గిపోతోంది. మరో మూడురోజుల్లో ఈ పండుగ ప్రారంభం కానుంది. అయినా ఏ ఇంటిముంగిళ్లలో సంక్రాంతి ముగ్గులు లేవు, గొబ్బెమ్మ తట్టేవారు లేరు, ఆ సందడే లేకుండా పోవడం చూసి వృద్ధులు ఆవేదనకు గురవుతున్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిస్తున్నారు.


గంగిరెద్దు

మా చిన్నతనంలో నెలంతా సందడే



మా చిన్నతనంలో సంక్రాంతి అంటే నెలరోజుల పండుగ. ఎక్కడ చూసినా ఆనందం. ప్రతి ఇంటిముంగిటా నెలరోజులంతా ముగ్గులు వేసేవారు. పేడతో ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి గుమ్మడి పూలు పెట్టి ఇంటిముంగిళ్లలో సంక్రాంతికి స్వాగతం చెప్పేవారు. నాడు ఉన్న మట్టి ఇళ్లకు సున్నంతో కొత్త శోభ కల్పించేవారు. పట్టణానికి వెళ్లి సరుకులు తెచ్చుకుని కూతుళ్లను, అల్లుళ్లను పిలిపించుకుని సంక్రాంతి సంబరంగా చేసుకునే వారు. నేడు ఆ జాడే లేకుండా పోయింది.

\- ముమ్మడి చిన్నయ్య, మన్నూరు, రాజంపేట


బంధుమిత్రులతో భోగి వేడుకలు (ఫైల్)


సందడిగొలిపే కత్తిలేని కోడిపందాలు

సంక్రాంతి కళ తప్పింది



రాను రాను పండుగలంటే తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి ఒక్క కారణం అంటూ చెప్పలేం. పల్లెవాసులందరూ ఉద్యోగాల పేరిట పట్టణాల్లో చేరి పండుగల గొప్పతనాన్ని మరచిపోయారు. ఒకనాటి సంక్రాంతి పండుగకు నేటి పండుగకు ఎంతో తేడా వస్తోంది. కాలానుగుణంగా యువత మారిపోయింది. పల్లెల్లో ఐకమత్యం తగ్గిపోయింది. ఆర్థిక పరిస్థితులు మెరుగు పడడంతో ఒకరిలో ఒకరు లేకుండా పోయారు. దీంతో సంక్రాంతి సైతం కళ తప్పింది.

\- గునకల సుబ్బరాయుడు, రాజంపేట

సంక్రాంతి కోసం రెండు ఆలయాలకు కమిటీల నియామకం

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా రాజుపాలెం మండలం వెల్లాల గ్రామంలోని రెండు దేవాలయాలకు కలిపి ఒక కమిటీని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. గ్రామంలోని చెన్నకేశవ సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు తొమ్మిది మందితో కూడిన ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేసింది. గ్రామంలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకూ సంక్రాంతి పండుగ నిర్వహించనున్న సందర్భంగా ఈ ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని నియమించింది.

గ్రామంలోని పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనరు ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ అన్ని నియమాలను సడలిస్తూ ప్రత్యేక సందర్భంగా పరిగణిస్తూ ఈ ధర్మకర్తల మండలి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీలో గ్రామానికి చెందిన గంగిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, సుంకుగారి లక్ష్మీనరసింహారెడ్డి, బీరం అశోక్ మహరాజ్ రెడ్డి, దుద్యాల అచ్చమ్మ, దూదేకుల చిన్నదస్తగిరి, సుంకుగారి సుజా రజని, భజంత్రి విజయలక్ష్మి, రామంతుల దీనమ్మ, మలికి రమణయ్యలను మండలి సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వీసీల నియామకానికి సెర్చ్ కమిటీలు

కలికిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని రెండు యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామకం కోసం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రెండు వర్సిటీలకు వేర్వేరుగా ఈ సెర్చ్ కమిటీలను నియమించారు. ఒక్కో యూనివర్సిటీకి వైస్ చాన్సలర్‌ను ఎంపిక చేయడానికి ముగ్గురి పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ఈ కమిటీలను ప్రభుత్వం కోరింది. ముగ్గురి నుంచి ఒకరిని ఎంపిక చేయడానికి చాన్సలర్ (గవర్నర్)కు పంపాల్సి ఉందని పేర్కొన్నారు.

సెర్చ్ కమిటీలో కూడా ప్రభుత్వం తరఫున ఒకరిని, సంబంధిత వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి ఒకరిని, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి మరొకరిని కలిపి సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు. కడప యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎంపిక కోసం ప్రభుత్వం తరఫున ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి.జార్జ్‌విక్టర్, ఈసీ నుంచి రాయలసీమ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎ.వి.ప్రసాదరావు, యూజీసీ నుంచి మండి సర్దార్ పటేల్ వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ దేవ్‌దత్ శర్మలను సెర్చ్ కమిటీ సభ్యులుగా నియమించారు.

ఇక కడప డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల సెర్చ్ కమిటీలో ప్రభుత్వం తరఫున కృష్ణా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రామకృష్ణారావు, ఈసీ నుంచి తిరుచ్చి ఎన్ఐటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్, యూజీసీ నుంచి లక్నో డాక్టర్ శకుంతలా మిశ్రా, నేషనల్ రిహాబిలిటేషన్ వర్సిటీ ప్రస్తుత వీసీ ప్రొఫెసర్ సంజయ్‌సింగ్‌లను నియమించారు.

సెర్చ్ కమిటీలు వీలైనంత త్వరగా సమావేశమై ముగ్గురి పేర్లను ప్రతిపాదించాల్సిందిగా ప్రభుత్వం కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ : ఒకరి మృతి


ఎజాస్‌అలీఖాన్ మృతదేహం, గాయపడ్డ రాజు

చిన్నమండెం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపాన కడప-బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన వారు కారులో రాయచోటి నుంచి బెంగళూరు వెళుతుండగా గుర్రంకొండ నుంచి ఎజాస్ అలీఖాన్ రాయచోటి వైపు వెళుతుండగా కారు ఢీకొనగా ఎజాస్‌అలీఖాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న రాజు, రత్నమ్మలు తీవ్రంగా గాయపడడంతో వారిని స్థానికులు, పోలీసుల సహాయంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నందలూరు వద్ద రెండు బైకులు ఢీకొని...


సంఘటనాస్థలంలో మృతదేహం, హరికృష్ణ (ఫైల్)

నందలూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : బైకులు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నాగిరెడ్డిపల్లెకు చెందిన సోమేశుల హరికృష్ణ (28) బైకుపై కడప వైపు వెళుతుండగా మంటపంపల్లె సమీపంలోని కోనరాజుపల్లె గ్రామానికి చెందిన ఈర్ల వేణుగోపాల్, ఈర్ల రాజశేఖర్ బైక్‌పై నందలూరు వైపు వస్తూ ఢీకొన్నారు. దీంతో సోమేశుల హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఇద్దరు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్‌లో ఫైళ్లు కదలడం లేదు

- మూలనపడ్డ దాదాపు 600 ఫైళ్లు
- వైసీపీ ప్రభుత్వంలో ఆదాయం వచ్చే ఫైళ్లకే ప్రాధాన్యం
- సాధారణ రైతుల ఫైళ్లన్నీ పక్కనే...
- 22ఏ, డాటెడ్ ల్యాండ్, ఫ్రీహోల్డ్ ఫైల్స్ పట్టించుకునే అధికారే కరువు...

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పటి నుంచి 22ఏ, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్, నేషనల్ ఖాతాలో ఉన్న భూముల ఫైళ్లు కొన్ని కలెక్టరేట్‌లో మూలనపడేశారని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు వారి స్వలాభాన్ని చూసుకుని వారికి డబ్బులు వచ్చే ఆ ఫైళ్లను మాత్రమే కదిలించారని, మిగిలిన ఫైళ్లన్నీ మూలనపడేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది నుంచి చాలామంది రైతులు తమ ఫైల్స్ కనపడటం లేదని, మా ఫైల్స్ పూర్తి కాలేదని కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రైల్వేకోడూరు, మదనపల్లి, రాజంపేట ప్రాంతాల నుంచి ఫైల్స్ విషయమై ఎక్కువగా ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారు. ఈ కార్యాలయంలోని కొన్ని సెక్షన్‌లలో ఉన్న కింది స్థాయి అధికారులు తప్పులు చేసి ఫైల్స్ పంపించడం వల్ల కూడా కొన్ని ఫైల్స్ వెనక్కి వస్తున్నాయని, అంతేకాకుండా సెక్షన్లలో సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల కూడా ఫైల్స్ ముందుకు జరగడం లేదన్న వాదన ఉంది. జిల్లాలోని 30 మండలాలకు చెందిన దాదాపు 600 పైచిలుకు ఫైల్స్ కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఫైల్స్ పూర్తి చేశారని, రైతులను పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 6 నెలలు పూర్తి అవుతున్నా 22ఏ, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్ ఒక్క ఫైల్ కూడా పూర్తి చేయలేదని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు గతంలో మూలనపడిపోయిన ఫైల్స్‌ను పూర్తి చేసి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి...

కలెక్టరేట్‌లో కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేస్తాము. గతంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కూడా ఆదేశించారు. ఆ ఫైళ్లన్నీ కూడా త్వరగా పూర్తి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాము.

\- మధుసూదన్‌రావు, డీఆర్‌వో

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోవాలి



జిల్లా అధికారులు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం చేస్తే వారిపైన వెంటనే చర్యలు తీసుకునే విధంగా పరిపాలన ఉండాలి. ఫైల్స్ తప్పులు రాసి పంపిస్తే వారిపై కూడా యాక్షన్ తీసుకోవాలి. అప్పుడే ప్రజలకు న్యాయం జరుగుతుంది. గత ప్రభుత్వంలో ఉన్న అధికారులు అందరు తమకు ఆదాయం వచ్చే ఫైళ్లను మాత్రమే కదిలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు కూడా ఫైల్స్ కదలడం లేదు. దూర ప్రాంతాల నుంచి రైతులు పదే పదే కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే ఎంత ప్రయాసో జిల్లా అధికారులు గుర్తించి వారి ఫైల్స్‌ను పూర్తి చేసి పంపాల్సిన బాధ్యత వారిపైన ఉంటుంది.

\- సాంబశివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను



రాజంపేట డివిజన్‌లోని పుల్లంపేట మండలం శ్రీనివాసపరంలో సర్వే నెంబర్-1215లో 2.60 ఎకరాలను గతంలో రిజిస్ట్రేషన్ కాకుండా ఆపేశారని అధికారులు చెప్పారు. అందువల్ల నేను ఏడాదికాలంగా కలెక్టర్ కార్యాలయంలో చాలాసార్లు అర్జీలు పెట్టాను. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయంపై సంబంధిత అధికారులను అడిగితే వెళ్లి మీ తహసీల్దార్‌లను అడగండి అని చెబుతున్నారు. వారిని అడిగితే కలెక్టర్ ఆఫీస్‌కి వెళ్లండి అని సలహా ఇస్తున్నారు. ఇలా ఒకరిపైన ఒకరు పెట్టుకుని ఏడాదికాలంగా నా ఫైలు చేయడం లేదు. నేను ఒక సామాన్య రైతుని. ప్రతిరోజూ కలెక్టర్ కార్యాలయానికి రావాలంటే నాకు ఎంత శ్రమ ఉంటుంది. రెండు బస్సులు మారి రాయచోటికి రావాలి. ఎంత ఖర్చు వస్తుందో ఒకసారి మీరే ఆలోచన చేయండి.

\- వెంకట్రామిరెడ్డి, పుల్లంపేట మండలం

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట



సిద్దవటం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో ఓ ప్రేమజంట వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లెకు చెందిన మనోహర్ (26), కళాశ్రీ (24) మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. మనోహర్ కడప ఎయిర్‌పోర్టులో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, కళాశ్రీ కడప వివేకానంద కళాశాలలో డిగ్రీ చదువుతోంది. వీరి వివాహానికి కుటుంబపెద్దలు అంగీకరించకపోవడంతో గురువారం ఉదయం 11 గంటలకు కడప-చెన్నై జాతీయ రహదారిలోని ఉమామహేశ్వర నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో వివాహం చేసుకుని పోలీసులను ఆశ్రయించారు. ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ వారు మేజర్లు కావడంతో, ఇరువురి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడగా మనోహర్ కుటుంబ సభ్యులు అంగీకరించారని, కళాశ్రీ కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నామని తెలిపారు.

నాటుసారా స్వాధీనం : ఇరువురి అరెస్టు

వాల్మీకిపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షికారిపాళెం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ ప్రాంతంపై ఈఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించి 30 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. గ్రామానికి చెందిన బి.శీన, జి.శంకరయ్య అనే వారిని అరెస్టు చేశారు. ఇరువురినిరిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. దాడులలో ఈఎస్‌టీఎఫ్ సీఐ యల్లయ్య, ఎస్ఐ శశిధర్, సిబ్బంది మోహన్‌రెడ్డి, వేమారెడ్డి, బాలకృష్ణ, విఘ్నేష్‌లు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు

- బిల్లుపైనే క్యూఆర్ కోడ్ ముద్రణ
- విద్యుత్ శాఖలో నూతన విధానం
- తొలి విడత కడప డివిజన్‌లో అమలు
- విజయవంతమైతే జిల్లా అంతటా...
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



సద్వినియోగం చేసుకోవాలి

క్యూఆర్ కోడ్‌తో బిల్లులు ఇస్తున్నాం. దీనిపై వినియోగదారులకు అవగాహన పెంచాం. బిల్లింగ్‌లో పారదర్శకత పెరుగుతుంది. స్కాన్ చేయడం ద్వారా చెల్లింపులతో ఎటువంటి మోసాలకు ఆస్కారం ఉండదు. వినియోగదారులు సులలువుగా చెల్లించుకోవచ్చు. బిల్లింగ్ లోపాలు ఉన్న సరిదిద్దుకోవచ్చు. ఈ అవకాశాన్ని అందరు విని యోగించుకోవాలి.

- ఎస్.హరి సేవ్యానాయక్, ఈఈ, కడప డివిజన్

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ఆశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ విధా నం సత్ఫలితాలు ఇస్తుందని సంబంధిత అధికారులు చెబుతు న్నా రు. ఇది విజయవంతం అయితే జిల్లా వ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుడతామన్నారు. నెలవారీ విద్యుత్ బిల్లుల చెల్లింపును ఏపీఎస్పీడీసీఎల్ మరింత సులభతరం చేసింది. ఇంటి వద్ద నుంచి బ్యాంకు ఖాతా ఫోన్ నెంబర్ అనుసంధానంగా ఉండే ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా చెల్లింపులు మరింత సులభతరం చేసేందుకు విద్యుత్ బిల్లులపైనే క్యూఆర్ కోడ్ ముద్రించింది. ప్రత్యేక డిజిటల్ విధా నాన్ని రూపొందించింది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సులువుగా బిల్లును చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు. జనవరి 1వ తేదీ నుంచి కడప డివిజన్ పరిధిలో ప్రారంభించారు. హెచ్‌టీ సర్వీసులకు మినహాయించి బకాయిలు లేని మిగిలిన సర్వీస్‌దారు లకు స్కాన్ ద్వారా బిల్లు కట్టే అవకాశాన్ని కల్పించారు.



బిల్లు చెల్లింపు కేంద్రాల వద్ద క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రయోగాత్మకంగా..

కడప డివిజన్ పరిధిలో జనవరి 1 నుంచి ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. కడప డివిజన్‌లో గృహ వినియోగదారులకు సంబంధించి 1,69,544 మీటర్లు, వాణిజ్య 23,793 మీటర్లు, పరిశ్రమల కోసం వినియోగించేవి 749 మీటర్లు, దేవాలయాలు, చర్చి, మసీదు, వీధి దీపాలు మంచినీటి పంపుల కోసం వినియో గించేవి 3818 మీటర్లు కలిపి మొత్తం 1,97,902 మీటర్లు ఉన్నాయి. అయితే గత ఏడాది జూన్ వరకు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్స్



ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వెసులుబాటు ఉండేది. రిజర్వు బ్యాంకు ఆదేశాలతో విద్యుత్ సంస్థలు వాటి సేవలు నిలిపివేశాయి. ఈ పద్ధతిలో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి విని యోగదారులకు సులువుగా ఉండేది. ఆ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సకాలంలో సంస్థ ఖాతాలకు డబ్బు జమ అయ్యేది కాదు. దీని వల్ల డబ్బుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ చెల్లింపుల్లో జాప్యం కారణంగానే రిజర్వు బ్యాంకు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా బిల్లులు చెల్లించే పద్ధతికి స్వస్తి చెప్పారు. ప్రత్యామ్నాయంగా పాత పద్ధతిలోనే మీ సేవా కేంద్రాలు, సంబంధిత సెక్షన్ కార్యాలయాలు, సంస్థకు చెందిన ఈస్ట్రన్ పవర్ యాప్‌లో చెల్లించేవారు. మీసేవా కేంద్రాల్లో అయితే సర్వీసు చార్జీ రూ.5చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు వినియోగదారునికి బిల్లులు అందిన వెంటనే చెల్లింపుల ప్రక్రియ వేగవంతమయ్యేలా క్యూఆర్ కోడ్‌ను విద్యుత్ సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. దీనిపై వినియోగదా రులకు అవగాహన కల్పిస్తున్నారు. క్యూఆర్ కోడ్ విధానంలో చెల్లిం పుల వల్ల పారదర్శకత ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సౌత్‌ఇండియా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రాజెక్టు ఎంపిక



విద్యార్థి గౌరీశంకర్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

పులివెందుల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సౌత్‌ఇండియా స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత (మెయి న్) పాఠశాలకు చెందిన విద్యార్థి గౌరీశంకర్ తయారు చేసిన సీఓ టూ ప్రాజెక్టు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గురు వారం స్థానిక పాఠశాలలో ఆయ న మాట్లాడుతూ బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో వ్యక్తిగత విభాగం కింద ఈ ప్రాజెక్టు ఎంపి కైందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు ఆపడం వలన కార్బన్ డైఆక్సైడ్ (సీఓటు) వాయువు ఎక్కువగా విడుదలై వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇందుకు పరిష్కారంపై ఉపాధ్యాయులు సీవీ ప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థి గౌరీశంకర్ ఈ ప్రాజెక్టును రూపొందించాడన్నారు. ఈ ప్రాజెక్టును ఈనెల 20 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో నిర్వహించే పోటీలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తల దాడి

వీరపునాయునిపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిదెన ఓబాయపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మందా శంకరయ్యపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో శంకర య్యకు తీవ్ర గాయాలపాలయ్యాడు. కలందొడ్డిలోకి నీళ్లు పోతున్నాయని అడిగినందుకు కామనూరు ఈశ్వరయ్య, శంకరయ్య, సారయ్యలు కలిసి దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భర్త హత్య కేసులో భార్యతో పాటు నలుగురికి జీవితఖైదు



నిందితులను చూపుతున్న పోలీసులు

మైలవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకు నేందుకు ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన కేసుకు సంబంధించి భార్యతో పాటు మరో నలుగురికి ప్రొద్దుటూరు రెండవ ఏడీజే కోర్టు జడ్జి ఒక్కొక్కరికి రూ.2లక్షల జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించినట్లు మైలవరం ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి గురువారం తెలి పారు. ఎస్ఐ వివరాల మేరకు.. తొర్రివేముల గ్రామానికి చెందిన కుమ్మరి గురుప్రసాద్, కుమ్మర ప్రమీల దంపతులు. కాగా, అదే గ్రామా నికి చెందిన తీట్ల సురేష్ అలియాస్ ఆటో సూరితో కుమ్మర ప్రమీల వివాహేతర సంబంధం పెట్టుకుంది. భర్త అడ్డు తగులుతున్నాడని పథకం ప్రకారం హత్య చేసేందుకు కుట్ర పన్నారు. ఈ నేపథ్యంలో 2019 జనవరి 24వ తేదీ సమీప గ్రామమైన వేపరాలకు గురుప్రసాద్ బేల్దారి పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి తొర్రివేముల గ్రామానికి తిరిగి వస్తుండగా.. వేపరాల తొర్రివేముల గ్రామాల మధ్య ఉన్న బాబాసాబ్ బావి వంక వద్ద నిందితులు అతనిపై రాడ్లతో దాడి చేసి కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మైలవరం పోలీసుస్టే షన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి నిందితులు కుమ్మర ప్రమీల, తీట్ల సురేష్ అలియాస్ ఆటో సూరి, కొమ్ము పెద్దిరాజు, చాకలి గురుస్వామి, మాదిగ ప్రతాప్‌లకు కోర్టు ఒక్కొక్కరికి రూ.2లక్షల జరిమానాతో పాటు జీవితఖైదు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

91క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వేంపల్లె, జనవరి 9 (ఆంధ్ర జ్యో తి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఐచర్ వాహనంతో పాటు 91క్వింటాళ్ల రేషన్ బియ్యా న్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమ రవా ణా చేస్తున్నా రన్న సమాచారం రావడంతో గురువారం తహసీల్దార్ హరినాధ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్, ఎస్ఐలు రంగారావు, తిరుపాల్‌నాయక్ తనిఖీ చేపట్టారు. చింతలమడుగుపల్లె-టి.వెలమవారిపల్లె గ్రామాల పొలాల మధ్య ఐచర్ వాహనంలో ఉన్న 177 మూటల రేషన్‌బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చంద్రమోహన్ అనే వ్యక్తిని అదుపు లోకి తీసుకొని.. బియ్యాన్ని గోడౌన్‌కు తరలించారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు నాయకుల నారాయణ, శివన్న పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కడప క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం డీఈవో కార్యాలయ సమీపంలోని మురుగుకాల్వలో అనుమానాస్పదస్థితిలో యువకుడి మృత దేహం లభించింది. స్థానికులు చిన్నచౌకు పోలీసులకు సమాచారం అం దించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మురుగుకాల్వలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. సిద్దవటం మండలం బోడిశెట్టిపల్లెకు చెందిన పోలుబోయిన నరసింహులు (33) కడప ఓంశాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఎంటెక్ పూర్తి చేసి కడపలో చిన్నచిన్న పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం తల్లి వీరమ్మ సొంత ఊరికి పోవడంతో ఇంట్లో నరసింహులు ఒక్కడే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కాల్వలో మృతదేహం ఉండడంతో స్థానికులు పోలీసుల కు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకొని పోస్టుమార్టం నిమి త్తం రిమ్స్‌కు తరలించారు. ఇతని మృతిపై పోలీసులు విచారిస్తున్నారు.

కరెంటు వైర్లు తగిలి యువకుడు...

కడప క్రైం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీఐ సర్కిల్ సమీపంలో విద్యుత్‌వైర్లు తగిలి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజీవ్‌కుమార్ (23) మృతి చెందినట్లు తాలూకా పోలీసులు తెలిపారు. సంజీవ్ కుమార్ కడ పలో రెండేళ్ల నుంచి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురు వారం మధ్యాహ్నం ట్రాన్స్‌పోర్టు వెనుక భాగంలో పనిచేస్తున్న సమ యంలో కరెంటు వైర్లు తగిలి మృతి చెందినట్లు తెలిపారు.

బ్రహ్మంసాగర్‌లో వృద్ధుడు..

బ్రహ్మంగారిమఠం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో గురువారం రామిరెడ్డి (78) అనే వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వీరపునాయునిపల్లె మండలం వెలుదుర్తి గ్రామా నికి చెందిన రామిరెడ్డి ఇంటి వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనానికి వెళు తున్నానని బ్రహ్మంగారిమఠంకు వచ్చి బ్రహ్మంసాగర్‌లో దూకి ఆత్మహ త్య చేసుకున్నాడని తెలిపారు.

రైతు ఆత్మహత్యాయత్నం

లింగాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దొండ్లవాగు గ్రామానికి చెందిన గంగిరెడ్డి బాల గంగిరెడ్డి అనే రైతు గురువారం తన ఇంటిలో ఉరి వేసు కొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే కాపాడడంతో ప్రాణాపాయం తప్పింది. బాల గంగిరెడ్డి తనకున్న పొలంలో శనగ పంట సాగు చేశాడు. ఇ-పంట నమోదు కోసం రైతు సేవా కేంద్రం సిబ్బందితో చర్చించి ఇ-పంటలో నమోదు చేయాలని కోరారు. తర్వాత ఏం జరిగిందో ఏమో పోలీసుస్టేషన్‌కు బాల గంగిరెడ్డిని పోలీసులు పిలిపించారు. స్టేషన్‌కు మరోసారి రావాలని చెప్పి పంపిం చడంతో ఆందోళనకు గురై బాలగంగిరెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

ఉపాధి పథకంలో ఖర్చు చేసింది రూ.8.48 కోట్లు

- అవినీతి జరిగింది రూ.36,350
- ఉపాధి సిబ్బందిపై అడిషనల్ పీడీ ఆగ్రహం
- తుమ్మలపల్లె ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ

బి.కోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గురువారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. 2023-24 సంవత్సరానికి రూ.8.48 కోట్లు ఖర్చు చేయగా అందులో అవినీతి రూ.36,350లు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం వెల్లడించారు. ఈ కార్యక్ర మానికి అడిషనల్ పీడీ నాగరత్నమ్మ, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి రామలింగారెడ్డిలు హాజర య్యారు. మండలంలో పది పంచాయతీలు ఉండగా, ఒక్కో పంచాయతీ గురించి సామాజిక తనిఖీ బృందం జరిపిన పనులు, వాటి వివరాలు అవినీతి బహిర్గతం చేశారు. వీటిపై ఉపాధి సిబ్బంది పని తీరు సక్రమంగా లేదని అడిషనల్ పీడీ నాగర త్నమ్మ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తుమ్మలపల్లె



ఉపాధి బహిరంగ సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణకు ఆదేశించారు. అలాగే పాయల కుంట్ల, మేకవారిపల్లె గ్రామ పంచాయతీల్లో పనులకు రాకున్నా మస్టర్లు వేయడం, ఒకరి బదులు మరొకరు పనిచేయడం, వారికి బిల్లులు చేయడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో ఎస్ఆర్‌పీ భాస్కర్, ఏపీడీ ఆనంద్, ఎంపీడీవో భాస్కర్ రావు, ఎంపీపీ చెన్నమ్మ, ఏపీవో రాజసాహెబ్, ఈసీ ఖాజా మరియు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఈ అవార్డు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం

- కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి

కమలాపురం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ లోని పాలిటెక్నిక్ ఫెస్ట్‌లో రెండో బహుమతి గెలిచిన విద్యార్థుల విజయం విద్యార్థుల ప్రతిభకు సాంకేతిక నైపుణ్యానికి నిదర్శ నమని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. గవ ర్నమెంటు పాలిటెక్నిక్, కమలాపురం కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులు మంగళవారం విజయవాడలో జరిగిన పాలిటెక్నిక్ ఫెస్ట్ 2024లో రెండో బహుమతి గెలుచుకుని కళాశాల పేరును రాష్ట్రస్థాయిలో వెలుగులోకి తెచ్చారన్నారు. గురువారం కళాశాలలలో రాష్ట్రస్థాయిలో పాలిటెక్నికల్ కళా శా లను ద్వితీయ స్థానంలో నిలిపిన విజేతలకు సన్మాన కార్యక్ర మం నిర్వహించారు. విజేతలను ఘనంగా సన్మానించారు. అనం తరం మాట్లాడుతూ టెక్నోఫెస్ట్‌లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులు శివకవిత, లావణ్య, ఈసీఈ రెండో సంవత్సరం విద్యా ర్థుల సృజనాత్మకత, ప్రతిభ కళాశాల గర్వించదగ్గది, వీరు



విజేతలను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

రూపొందించిన డిస్పెన్సరీ ఫర్ ఎల్డర్లీ మెడికేషన్ అడ్హెరెన్స్ ప్రాజె క్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించిందని ఆయన తెలిపారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు హోదా సభ్యులు పాల్గొని విజేతలను అభినందించారు.

గంగమ్మగుడి వేలం బకాయిలు రూ.8.67 లక్షలు

సికెదిన్నె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మగుడి తలనీలాలు, టెంకాయల వేలానికి సంబంధించి రూ.8,67,300 బకాయిలు ఉన్నట్లు ఈఓ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఈఓ బ కాయిల వివరాలను పత్రికా విలేకరులకు వివరించారు. ఇందులో తలనీలాలకు సం బంధించి రూ.6,38,300 బకాయిలు ఉన్నాయన్నారు. 2015-16లో ఎస్.సాయి రూ.1.45లక్షలు, 2016-17లో జె.చి న్నశ్రీను రూ.95,500, 2017-18లో ఎస్.క్రిష్ణమూర్తి రూ.2,42,700, 2018-19లో పి.సుబ్బరాయుడు రూ.9600, 2020-21లో ఎం.పుల్లయ్య రూ.1,45,500 బకాయిలు ఉన్నారు. టెంకాయల వేలానికి సంబంధించి 2015-16లో బి.వి.రమణ రూ.30వేలు, 2021-22లో ఎస్.పాలకొండయ్య రూ.45వేలు, 2023-24లో ఇ.రామలక్ష్మిరెడ్డి రూ.1.54 లక్షలు మొత్తం రూ.2.29 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. వారికి నోటీసులు కూడా అందించామని ఈఓ తెలిపారు.

రూ.2.15 లక్షలు పలికిన తలనీలాల వేలం

గంగమ్మగుడి తలనీలాల వేలం రూ.2.15 లక్షలకు వెంకటరమణ దక్కించుకున్నట్లు ఈఓ రవిశేఖర్‌రె డ్డి తెలిపారు. గంగమ్మ ఆలయంలో బుధవారం నిర్వహించిన టెండర్ల వేలంలో పెండ్లిమర్రి మండ లానికి చెందిన రమణ వేలం దక్కించుకున్నాడన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు తలనీలాలు పోగుచేసుకునే హక్కు కలిగిఉంటారన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇజితెమా..!

- చివరి రోజు లక్షలాదిగా తరలివచ్చిన ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూ రు కేంద్రంగా మూడురోజుల పాటు జరిగిన ఉమూమి తబ్లీగీ ఇజితెమా గురువారం మధ్యా హ్నం ప్రశాంతంగా ముగిసింది. చివరి రోజు జరిగిన సామూహిక దువా కార్యక్రమానికి లక్ష లాదిగా ముస్లింలు హాజరయ్యారు. ఇజితెమాలో జరిగే ఈ దువా కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం రాత్రికే లక్షలాదిగా ముస్లింలు ఇజి తెమా ప్రాంగణానికి చేరుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచే సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ఆ తర్వాత ముంబై, నిజామోద్దిన్, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా హాజరైన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గ దర్శకాలతో పాటు ప్రపంచశాంతి, దేశ ఔన్నత్యం గురించి వివరించారు. సర్వమానవాళి సమాన మేనని అందరి పట్ల ప్రేమ, కరుణ, జాలి, దయ, ఆప్యాయతను కలిగి ఉండాలని ఉపదేశించారు. మతాలకు అతీతంగా దేశ ఐక్యతను కాపాడు కుందామని ఉద్బోధించారు. ఆ తర్వాత 12.30 గంటల సమయంలో సామూహిక దువాను నిర్వహించిన అనంతరం మధ్యాహ్న నమాజ్‌ను పూర్తి చేసుకుని ఇజితెమా వేడుకలకు ముగింపు పలికారు. ఇదిలా వుంటే చివరి రోజు కూడా ఇజి తెమాకు వచ్చిన వారికి నిర్వహణ కమిటీ వా రు భారీ ఏర్పాట్లను కల్పించారు. వచ్చిన వారికి అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ సదుపాయం సమకూర్చారు.



ఇజితెమాలో దువా చేస్తున్న ముస్లింలు

అదేక్రమంలో 17 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసిన సౌకర్యవంతమైన భోజన వసతిని కల్పి ంచారు. వివిధ ప్రాంతాల నుంచి దాతలు ఇజి తెమాకు వచ్చిన వారికి మజ్జిగ, పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ చేపట్టారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను సిద్ధం చేశారు. అలాగే ఉచిత వైద్య శిబిరాలను ఏర్పా టు చేసి వైద్యసేవలు అందించారు. ఇజితెమా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల్లో కొనుగోళ్లు ఉత్సాహంగా సాగాయి. చివరి రోజు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్, నందికొట్కూరు మాజీ ఎమ్మె ల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ఇజితెమా కార్యక్రమా న్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లపై కమిటీని అభినందించారు.

ముస్తాబైన వైకుంఠ ద్వారం



చక్రాయపేట, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి): పలు వైష్ణవాలయాల్లో వైకుంఠద్వార దర్శనం కోసం ఏర్పా ట్లు చేశారు. ఇందులో భాగంగా వేంకటేశ్వర, రాచరాయ దేవస్థానంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరగనున్నట్లు ఆలయ చైర్మన్ మోపూరి రామాం జనేయరెడ్డి, మాజీ చైర్మన్ చక్ర పాణిరెడ్డి, ఓబుళరెడ్డి తెలిపారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరిం చుకుని వేకువ జాము నుంచే స్వామివారికి ధనుర్మాస కైంకర్యాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు వైకుంఠ ద్వార సర్వదర్శనం ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. భక్తులు దర్శించుకోవచ్చని కోరారు.

వల్లూరు మండలంలో నేడు...

వల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నేడు వైకుంఠ ఏకాదశి సందర్భంగా పుష్పగిరి, పైడి కాల్వ, వల్లూరు తదితర గ్రామాల్లో ఉన్న ఆలయాలు శుభ్రం చేశారు. ప్రాతఃకాలాన్నే విశేషంగా అభిషేకాలు, ఉత్తర ద్వార దర్శనాలు ఉంటాయన్నారు.

రామాపురంలో...

కమలాపురం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రామాపురంలో వె లసిన మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ఉత్తరద్వారం ద్వారా మోక్షనారాయణస్వామిని దర్శించుకోవచ్చన్నారు. ఉదయం 5.30 నుంచి సాయంత్రం 6 వరకు ప్రవేశి స్తారని పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు సభ్యులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి



ముందస్తు సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులతో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె సాయిబాబా పాఠశాలలో గురువారం ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వీ. రామచంద్రారెడ్డి పండుగల ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేస్తూ సంక్రాంతి రోజు గంగిరెద్దుల, హరిదాసుల సందడి, భోగివళ్ల గొప్పదనాన్ని వివరించారు. పల్లె ప్రజలు ఆనందోత్సాహాలతో మూడు రోజుల చేసుకునే తెలుగు పడుగ సంక్రాంతి అని ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. 46వ డివిజన్ కార్పొరేటర్ ఎం.వీ.శ్రీదేవి మాట్లాడుతూ రైతులు తాము కష్టపడి పండించిన పంటలను ఇంటికి తెచ్చి, ఆ కష్టాన్నంతా మరిచి పండుగను సంతోషంగా చేసుకుంటారని, రైతన్నలకు ధన్యవాదాలు తెలిపారు. సాయిబాబా విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎం.వీ.సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సాయిబాబా పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను అలవాటు చేయాలి

కోవరంగుట్టపల్లి పాఠశాలలో వేడుకగా ముందస్తు సంక్రాంతి సంబరాలు




కోవరంగుట్టపల్లి పాఠశాలలో ఆకట్టుకుంటున్న సంక్రాంతి రంగవళ్లులు - గంగిరెద్దు హరిదాసు వేషధారణలో చిన్నారులు

సింహాద్రిపురం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాతి పండుగ ప్రాశస్త్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు తెలపాలని ఎంఈఓ-2 శారద పేర్కొన్నారు. కోవరంగుట్టపల్లి ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముందస్తు సంక్రాంతి సంబరాలను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ పాఠశాలలో ముందస్తు సంబరాలు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. పండుగ ప్రాశస్త్యంపై విద్యార్థులకు వివరించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం రేగుపండ్లు, పూలు, చిల్లర నాణాలు కలిపిన మిశ్రమం, చిన్నారుల తలపై వేసి ఆశీస్సులు అందజేశారు. అంతకంటే ముందు పాఠశాల ఆవరణ మంతా ముగ్గులు, రంగవళ్లులతో, టెంకాయ పట్టలు కట్టి ముస్తాబు చేశారు. దీంతో పాఠశాల ఆవరణం పండుగ వాతావరణం సంతరించుకుంది. కార్యక్రమం హెచ్‌ఎం రామసుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో...

వేంపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్ చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటన విషాదకరం

తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో టోకన్ల తోపులాట ఘటన విచారకరమని తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కాంగ్రెస్ నేతలతో కలిసి తులసిరెడ్డి మౌనం పాటించారు. టీటీడీ చరిత్రలో చీకటి రోజని అభిప్రాయ పడ్డారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

ఆహార కల్తీలను గుర్తించండి

పులివెందుల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆహార ఉత్పత్తుల్లో జరిగే కల్తీలను గుర్తించాలని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. గురువారం బ్రాహ్మణపల్లెలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించి ఆహార ఉత్పత్తుల్లో జరిగే కల్తీలను ఎలా గుర్తించాలనే అంశంపై అవగాహన కల్పించారు. పాలు, చక్కెర, ఉప్పు, పసుపు పొడి, కారం పొడి, నెయ్యి, పచ్చి బఠాణీ, కందిపప్పు, మినప పప్పు, మిరియాలు, తేనె తదితర ఆహార పదార్థాల్లో ఉన్న కల్తీని సులభమైన పద్ధతిలో ఎలా కనుగొనాలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రదర్శన ద్వారా తెలియజెప్పారు. ఈ ప్రదర్శనకు ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, వ్యవసాయాధికారి నాగలక్ష్మి హాజరయ్యారు. కళాశాల అధ్యాపకులు అరుణ, డాక్టర్ సాయి శ్రీనివాస్, కె.సుబ్బారెడ్డి, ఎన్.వి.సుబ్బారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, విద్యార్థులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

క్రీడలు మానసికంగా దృఢంగా ఉంచుతాయి



క్రీడాకారులతో కలిసి వస్తున్న ఎమ్మెల్యే

వల్లూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు జీవితంలో ఒక భాగం కావాలని క్రీడలు ఆడితే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతామని ఎమ్మెల్యే క్రిష్ణ చైతన్యరెడ్డి అన్నారు. అచ్చింతాయపల్లెలో అచ్చింతాయపల్లె ప్రీమియర్ లీగ్ సీజన్ 3 క్రికెట్ పోటీలను ప్రారంభించారు క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి క్రీడలు ప్రారంభించిన ఆయన సోదరుడు సాయినరసింహారెడ్డి బౌలింగ్ చేయగా, ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో టోర్నమెంటు నిర్వాహకులతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, మండల పరిధిలోని టీడీపీ నేతలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'సోలార్‌తో 90 శాతం బిల్లులు తగ్గింపు'

కడప(వినాయకనగర్), జనవరి9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్‌వైహెచ్‌ఆర్ సోలార్‌తో 90 శాతం విద్యుత్ చార్జీలు తగ్గింపు ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్యానాయక్ తెలిపారు. కడప నగరంలో గురువారం సోలార్ విద్యుత్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను బిగించుకుని 90 శాతం సబ్సిడీని పొందాలన్నారు. మీ ఇంటిపైనే కావాల్సినంత విద్యుత్‌ను తయారు చేసుకోవచ్చన్నారు. ఎస్‌వైహెచ్ సోలార్స్ అధినేత సిద్దవటం యానాదయ్య మాట్లాడుతూ పెట్టుబడిలో 90 శాతం బ్యాంకులు ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఐదేళ్ల వరకు ఉచిత సర్వీస్ ఉంటుందన్నారు. 25 సంవత్సరాల వరకు ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ పొందవచ్చన్నారు. రిటైర్డ్ డీఎస్పీ అశోక్‌రెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున, బండి ప్రసాద్, శివకోటిరెడ్డి, నాయకులు ఓర్సు బాలకొండయ్య, ఆర్‌పీ రమణ, దస్తగిరి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

పశువుల హింస, అక్రమ తరలింపు నేరం : కలెక్టర్

కడప కలెక్టరేట్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): పశువులను హింసించినా, బహిరంగ ప్రదేశంలో వధించినా, అక్రమంగా తరలించినా చర్యలు తప్పవని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడంపై అధికారులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రంలోనూ ప్రివెంటేషన్ ఆఫ్ క్రూసిల్టి టు అనిమల్స్ సొసైటీని ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసి ఉందన్నారు. జిల్లాలో 2017లో సొసైటీని ఏర్పాటు చేశారని, సొసైటీలో 14 మంది అఫీషియల్ మెంబర్సు, ఐదుగురు పశు సంరక్షకులు సభ్యులుగా నియమించబడ్డారు. గోశాలలను రక్షించడం, పశువుల ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనిమల్ వెల్ఫేర్ బోర్డు వారు పాఠశాల పిల్లలకు ఐదవ తరగతి నుంచి 8వ తరగతి వరకు మిషన్ కోర్సు, తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు అడ్వాన్స్ కోర్సెస్ మీద ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారన్నారు. ప్రభుత్వం కోడి పందేలు జరగకుండా చట్టాలను అమలులోకి తీసుకు వచ్చిందన్నారు. కోడి పందేలు నిర్వహణ, నేరమన్నారు. అక్రమంగా ఆవులను, దూడలను, ఒంటెలను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ నగర కమిషనరు మనోజ్ రెడ్డి, పశు సంవర్ధక జేడీ శారదమ్మ, డీఈఓ పాల్గొన్నారు.

జిల్లా పోటీలను దిగ్విజయం చేయండి

కడప స్పోర్ట్స్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జన్మదినంతో (నేషనల్ యూత్‌డే), సంక్రాంతి వేడుకలు పురస్కరించుకుని 12న ఆదివారం ఉదయం 8 గంటలకు నగర మునిసిపల్ స్టేడియంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మణికంఠ పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో తలపెట్టిన పోటీలకు జిల్లాలోని 15 నుంచి 29 ఏళ్లలోపు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరచి దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు.

వికాస్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు



చిన్నారులను ఆశీర్వదిస్తున్న కరెస్పాండెంట్ హరికృష్ణ

కడప ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్కాయపల్లె వికాస్ ఈఎం హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ 20ఏళ్లగా సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. సూర్యుడు మకరరాశిలోనికి ప్రవేశించాక ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుందన్నారు. ఈ పర్వదినాన వచ్చే పండుగ సంక్రాంతి పండుగ అని తెలిపారు. రైతుల పండగ అని కూడా అంటారని తెలిపారు. ఏర్పాటుచేసిన భోగిమంటలు, కోడిపందేలు, చిన్నారులు పైన వేసిన భోగిపండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం హమీద్, ప్రిన్సిపాల్ ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా 'అమ్మఒడి'లో అన్నదానం



అన్నదానం చేస్తున్న లేవాకు రఘునాథరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి):కడప నగరం మా అమ్మ ఒడి అనాథ శరణాలయంలో గురువారం లేవాకు నారపురెడ్డి 13వ వర్థంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనాథ పిల్లలకు అన్నదానం చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు. కార్యక్రమలో లేవాకు రఘునాథ రెడ్డి, లేవాకు లక్ష్మిరెడ్డి, లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి, వసంతు వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో కడప ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి పెండింగ్ ఫీజు విడుదల చేయాలని, తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరంలోనే అమలు చేయాలని నిరసన చేపట్టిన ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు పూర్తి కావస్తున్న విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ విద్యార్థుల సమస్యలను పెడచెవిన పెట్టారన్నారు.

వెంకన్నకు వెండి శంఖుచక్రాలు



వేంకటేశ్వరస్వామికి వెండి శంఖుచక్రాలు, హస్తాలను అందిస్తున్న శ్రీనివాసులు దంపతులు

వేంపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో వెలసిన వృషభాచలేశ్వరదేవస్థాన అనుబంధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన వెంకన్నస్వామికి వెండి శంకు చక్రాలు, హస్తాలు బహూకరించారు. స్థానిక గండి రోడ్డుకు చెందిన నందిబత్తిన శ్రీనివాసులు, ఈశ్వరమ్మ దంపతులు రూ.1.70లక్షల విలువైన 1.50 కేజీల వెండి శంకుచక్రాలు, హస్తాలను గురువారం ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, పూజారి అచ్యుత్, దేవస్థాన మాజీ సభ్యులు పివి రమణకు అందించారు. స్వామికి వెండి ఆభరణాలు బహూకరించిన దంపతులను ఈ సందర్భంగా సత్కరించారు. ఆలయ సిబ్బంది రంగప్రసాద్, దాసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగనాథుని కల్యాణ మహోత్సవం

పులివెందుల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురాతన ఆలయమైన రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చైర్మన్ సుధీకర్‌రెడ్డి, కార్యనిర్వాహణాధికారి రమణ తెలిపారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తెల్లవారు జామున 4గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకారం, 5గంటలకు వైంకుఠ ద్వార దర్శనం, ఫల సమర్పణ, ఉభయదారులచే విష్ణుసహస్రనామ, లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణాన్ని కాలుష్యరహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గాలి నాణ్యతా ప్రమాణాలు పెంపొందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రీయ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలను పాటించి, వాతావరణ కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నగర కమిషనరు మనోజ్ రెడ్డి, ఎస్‌ఈ చెన్న కేశవ రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, జిల్లా కాలుష్య నియంత్రణమండలి అధికారి సుధాకర్, ఏఈ అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ ఈఈలు నారాయణ రెడ్డి, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి వేతనం అందేలా చూడాలి : పీడీ

కమలాపురం రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, పూర్తి వేతనం అందేలా చూడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉందని డీడబ్ల్యుఎంఏ పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. ఉపాధి కార్యాలయంలో జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణను సందర్శించిన ఆయన మాట్లాడుతూ వలసల నిర్మూలనకు కేంద్రం చేపట్టిన పథకం ఉపాధి హామీ అని అన్నారు. పనికి వచ్చిన ప్రతి కూలీకి రోజుకు రూ.300 పడేలా మార్కింగ్ ఇవ్వాలని మేట్ల సాయంతో కూలీలతో కనీసం నాలుగు గంటలు పనిచేయించి పూర్తి వేతనం అందేలా చూడాలని ఆదేశించారు. ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, కమలాపురం, వీఎన్‌పల్లె, వల్లూరు, చెన్నూరు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు, రిసోర్స్ పర్సన్స్, సీఓ తదితరులు హాజరయ్యారు.

ప్రతి రైతు ఇ-కేవైసీ చేసుకోవాలి

లింగాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ఇ-క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఇ-కేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. గురువారం రైతు సేవా కేంద్రంలో మండల రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమీక్షించారు. రబీలో సాగుచేసిన పంటలకు మాత్రమే ఇ-క్రాప్ చేయాలని, సోషల్ ఆడిట్ నిర్వహించాలని, పంట నమోదు అనర్హులను నమోదు చేసిన మరే ఇతర తప్పిదాలు జరిగిన సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్త

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో నిర్వహించాని గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా సూచించారు. నాణ్యత కొరవడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం కడప రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. డీఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి కడప రైల్వేస్టేషన్‌కు రావడంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు సలహాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డీఎన్ అభిరాం, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, కడప రైల్వే మేనేజర్ శేఖర్‌కుమార్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

గురుకుల్ విద్యాపీఠ్‌లో వేడుకగా ముందస్తు సంక్రాంతి



సంక్రాంతి సంబరాల్లో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గురుకుల విద్యాపీఠ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో గురువారం ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఏపీఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ప్రతి పండుగను సంప్రదాయ పద్ధతుల్లో చేసుకోవాలన్నారు. పడుగలు మన సంస్కృతి సంప్రదాయాలను నిలుపుతామన్నారు. అనంతరం చిన్నారులపై భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు. చిన్నారులు రంగురంగుల దుస్తులతో సందర్శకులను ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ వివేకానంద, ప్రిన్సిపల్ మునిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గండికోటలో సినీ స్టూడియో నిర్మించాలి

కడప నాగరాజుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన గండికోటలో సినిమా స్టూడి యో నిర్మించాలని దీని వల్ల రాయలసీమ ప్రాంతం ఆర్థికం గా కొంత పుంజుకోగలదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పీవీఆర్ గ్రాండ్ ఇన్ సమావేశ మందిరం లో రాయలసీమ టూరిజం అడ్ కల్చరల్ సొసైటీ, ఇన్‌టాక్, పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి-కంచమ్మ, సరస్వతమ్మ స్మారక ట్ర స్టు ఆధ్వర్యంలో గండికోట ఆవిర్భావ దినోత్సవం నిర్వహించా రు. ఇన్‌టాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి, కొండూరు జనార్ధనరాజు, లయన్ జోజిరెడ్డి, కేవీ రమణారెడ్డి, రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు.

రెస్టారెంట్ల ఆకస్మిక తనిఖీలు


ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరు రోడ్డులోగల పలు హోటళ్లు, రెస్టారెంట్లను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తన సిబ్బందితో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ఓ హోటల్‌లో ఫ్రిజ్‌లో నిల్వఉంచిన మాంసం, కుళ్లిన కోడిగుడ్లను ఆయన గుర్తించారు. సంబంధిత హోటల్ యాజమాన్యాన్ని ఆయన హెచ్చరించారు. హోటళ్లలో పరిశుభ్రత చాలా ముఖ్యమని, చెడిపోయిన ఆహార పదార్థాలను విక్రయించిన హోటల్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే హోటళ్ల నుంచి వచ్చే చెత్త, వ్యర్థ పదార్థాలు బయట వేయరాదని, చెత్త సేకరణ వాహనాలలో మాత్రమే వేయాలని సూచించారు. అలాతే తరచూ శానిటేషన్ సెక్రటరీలు హోటళ్లను తనిఖీ చేయాలని పలు సూచనలు చేశారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

- ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఎర్రగుంట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనానికి ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి. విద్యుత్‌దీప కాంతులతో, పూల అలంకరణతో ఆలయాలు శోభాయమానంగా విరాజిల్లుతున్నాయి. చిలమకూరులోని శ్రీదేవి భూదేవి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల నమూనాలో ఏడు ద్వారాలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహిస్తారు. తెల్లవారుజాము నాలుగంటల నుంచే స్వామివారి దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎర్రగుంట్ల పద్మావతినగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, పోట్లదుర్తిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు


పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

బద్వేలుటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లె వెంకటసుబ్బారెడ్డి, పాఠశాల స్టాఫ్ సెక్రటరి సానె రమేష్‌రాజాలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది ముందుండి విద్యార్థులచే ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం విద్యార్థినీలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

'అమిత్‌షా.. పదవికి రాజీనామా చేయాలి'



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విజయజ్యోతి, కాంగ్రెస్ నాయకులు

పోరుమామిళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, బద్వేలు నియోజకవర్గ కోఆర్డినేటరు ఎండీ విజయజ్యోతి అన్నారు. గురువారం పోరుమామిళ్లలో అంబేద్కర్ విగ్రహం ద్వారా జైబాబు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హోంమంత్రి రాసిన లేఖలను అంబేద్కర్ పాదాల వద్ద ఉంచి నిరసన తెలిపారు. అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ నెల 26 వరకు ప్రతి పల్లె నుండి ఢిల్లీ వరకు వాడవాడలా తమ పార్టీ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారని, జాతీయ నాయకున్ని, మహిళలను తూలనాడడం బీజేపీ నాయకులకు పరిపాటైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మండల పీసీసీ సభ్యులు అన్వర్‌బాషా పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- ఆగని అక్రమ రవాణా
- లారీ.. ట్రాక్టర్లతో తరలింపు
- లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న వైనం

మట్టి మాఫియా రెచ్చిపోతున్నారు. రోజుకు వందల వాహనాల్లో అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి, గ్రావెల్‌కు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని కొందరు బరితెగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వాహనాల్లో తరలిస్తున్నారు. నడిరోడ్డులో వాహనాలు తిరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు, తహసీల్దారు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుకోవాలని పలువురు కోరుతున్నారు.


ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్న దృశ్యం

బద్వేలు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బద్వేలు, గోపవరం మండలాల్లో మట్టి, గ్రావెల్‌ను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. పట్టపగలే ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలించేస్తున్నారు. ప్రస్తుతం మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ బాగా ఉంది. ఇదే అదునుగా చూసుకొని కాసులు వెనకేసుకుంటున్నారు. రోజుకు వేల టన్నుల్లో మట్టి కొల్లగొట్టేస్తూ ఇటు అధికారులకు, అటు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ప్రతి రోజూ ట్రాక్టర్లు, లారీల ద్వారా పెద్ద ఎత్తున మట్టి ఆక్రమణ జరుగుతున్నా ఫిర్యాదులు చేస్తే తప్ప అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. అడపా దడపా దాడులు చేయడం తప్ప కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో యథేచ్ఛగా చెరువులు, ప్రభుత్వ భూములలో మట్టి స్వాహా చేస్తున్నారు. వైసీపీ హయాంలో అడ్డగోలుగా మట్టిని తవ్వేసి లక్షలాది రూపాయలు సంపాదించుకున్నారు. అప్పట్లో అధికారులంతా వైసీపీకి అనుకూలంగా ఉండడంతో వారి అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకున్నారు. ముఖ్యంగా భాకరాపేట, బోయనపల్లె, వల్లెలవారిపల్లె చెరువు, బద్వేలు చెరువులలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టి అక్రమ తవ్వకాలు జరుగు తున్నాయి. కొన్నిచోట్ల 2 రోజులకు అనుమతి తీసుకొని ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ రూ.600, టిప్పర్ రూ.4500లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.


టిప్పర్ ద్వారా తరలిస్తున్న మట్టి

అడపా... దడపా దాడులు

బద్వేలు, గోపవరం మండలాల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తూ ధనార్జనే ధ్యేయంగా మాఫియా ఈ అక్రమ దందా కొనసాగిస్తుండగా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవడం, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తక్కువ స్థాయిలో అపరాధ రుసుం వేసి వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మట్టి మాఫియా అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు, తహసీల్దారు ప్రత్యేక దృష్టి సారించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే చెరువుల రూపురేఖలు మారే పరిస్థితులు ఏర్పడతాయని పలువురు పేర్కొంటున్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు

- వేణుగోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ

ఎవరికీ చెరువులలో, కుంటలలో మట్టిని తవ్వేందుకు అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు. అనుమతులు తీసుకుని మట్టిని తరలించాలి. లేనిపక్షంలో ఆ ట్రాక్టర్లు సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తాం. ఇటీవల కాలంలో అలాంటి అక్రమాలకు పాల్పడిన మూడు ట్రాక్టర్లను సీజ్ చేశాం.

పద్మశాలీయ క్యాలెండర్ ఆవిష్కరణ

జమ్మలమడుగు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని శ్రీ భద్రావతి భావనారుషి స్వామి దేవస్థానంలో గురువారం పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చింతలపల్లె రుద్రమహేశ్వరుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోకన్వీనర్ దశరథరామయ్య, మేడికుర్తి ఆదినారాయణ, పుత్తా బ్రహ్మం, అవ్వారు ఈశ్వరయ్య, శిలివేరు వెంకటేశ్వర్లు, జయరాం, ఎంపీటీసీ బాబు, గోరంట్ల వెంకటరామయ్య, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

పోరుమామిళ్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. గురువారం యూటీఎఫ్ సంఘం వారు రూపొందించిన మోడల్స్ పేపరు గల పుస్తకాలను పంపిణీ చేశారు. టేకూరుపేటతో పాటు పోరుమామిళ్ల ఉన్నత పాఠశాల మరికొన్ని ప్రాంతాల్లో దాదాపు వంద మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రావు మాట్లాడుతూ ఈ మెటీరియల్ వెనుకబడిన విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అమృతబిందు పరిషత్ పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరుటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): లైట్‌పాళెం సెంటర్‌లో ఎంవీఎస్ జ్ఞాన కేంద్రంలో బ్రహ్మశ్రీ కైవల్యతీర్థస్వామి రచించిన అమృతబిందు పరిషత్ పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విష్ణుసహస్ర పారాయణం, పుస్తకంలోని అంశాలపై కైవల్య తీర్థస్వామి ప్రసంగించారు. వైకుంఠ ఏకాదశి ప్రాముఖ్యత గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ జ్ఞానేశ్వరమ్మ, శిష్య బృందం, భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

బద్వేలు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కన్వీనర్ బి.ఓబయ్య, జిల్లా నాయకులు చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో రైతుకు గాయాలు

గోపవరం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాచాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బెడుసుపల్లె గ్రామానికి చెందిన రైతు సుబ్బారెడ్డిపై గురువారం పిచ్చికుక్క దాడి చేసింది. ఈ సంఘటనలో రైతుకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ రైతును వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. పొలం పనులను ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది.

జ్వరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కె.లక్ష్మీనాయక్

కలసపాడు/బీకోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దోమకాటు వల్ల వచ్చే జ్వరాల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కె.లక్ష్మీనాయక్ తెలిపారు. గురువారం బి.కోడూరు, నరసాపురం, కలసపాడు ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

జమ్మలమడుగు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలు కంపెనీల ప్రతినిధులు హాజరై ఎంపికలు చేశారు.

గర్భిణీలకు స్వీట్లు, అన్నదానం


గర్భిణీలకు స్వీట్లు అందిస్తున్న టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

బి.కోడూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ వైద్యశాల నందు ప్రతి నెలా 9న జరిగే ప్రధాన మంత్రి సురక్షత్ మహా అభియాన్ కార్యక్రమం వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయకిరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాదాపు 40 మంది గర్భిణీలకు మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వారికి అన్నదానం, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా జరిగే ఈ కార్యక్రమానికి వచ్చే గర్భిణీలు, బాలింతలకు తమ పార్టీ తరపున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నెల్లి నీటి సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మేకవారిపల్లె నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి, సర్పంచ్‌లు పవన్, గురయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గణిత అధ్యాపకుడికి డాక్టరేట్


వెంకటేశ్వర్లు

జమ్మలమడుగు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత శాస్త్ర అధ్యాపకుడు వెంకటేశ్వర్లు యోగివేమన విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గణిత శాస్త్రంలో 'థిరిటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ది క్యారెక్టరీస్ ఆఫ్ వీరియస్ హైబ్రేడ్ నానోఫ్లూయిడ్ ఓవర్ ఏ స్ట్రూర్‌బై ఉసింగ్ స్టాటిస్టికల్ టూల్ అనే అంశంపై పరిశోధన చేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టర్ భూషణంకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

అధ్యాపకుడు సునీల్‌కు...


సునీల్

ప్రొద్దుటూరుటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన అధ్యాపకుడు సునీల్‌కు ఎస్‌కే యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. యూనివర్శిటీ అధ్యాపకులు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో ఆయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. కాగా కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, అధ్యాపకులు ఆయనను అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రొద్దుటూరుటౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సాయిసాకేత్, విష్ణుసాయి, గౌస్‌బాయిగారి గైబు, లక్షిత్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వారు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి, కోచ్‌లు అహమ్మద్, నస్రూలు అభినందించారు.

చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ గురివిరెడ్డి

మైదుకూరురూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చేస్తామని కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని కేసీ కెనాల్ బంగ్లా వద్ద రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్ట్ చెర్మన్, వైస్ ఛైర్మన్ గురివిరెడ్డి మాట్లాడుతూ రాజోలి జలాశయం నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని అసెంబ్లీలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడారని, అంతేకాకుండా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా రాజోలి ఆనకట్ట ఎత్తును పెంచేందుకు కట్టుబడి ప్రభుత్వంతో పనిచేయించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్యం రవీంద్రారెడ్డి, కేసీ కెనాల్ డీఈ పుల్లయ్య, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: కాల్వల అభివృద్ధికి నిధులు తెచ్చి అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని కేసీ కాల్వ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బి.రామలింగారెడ్డి తెలిపారు. గురువారం జిల్లా సరిహద్దులోని రాజోలి ఆయకట్టును ఆయన పరిశీలించారు. మైదుకూరు డివిజను పరిధిలో కేసీ కాలవలు మరమ్మతు పనులు, పూడిక తీత పనులకు దాదాపు రూ.30 కోట్ల నిధులు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ గుర్విరెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, నీటి సంఘాల అధ్యక్షులు అధికారులు పాల్గొన్నారు.

దువ్వూరు: మార్చి చివరి వరకు కేసీకాలువల ద్వారా సాగునీరు అందేలా కృషి చేస్తామని కడప, కర్నూలు ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన కేసీ కాలువ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ కోనేటి హరినాథ్‌తో పాటు ఇతర నీటి సంఘాల ప్రెసిడెంట్లు, మండల కన్వీనర్ రమణారెడ్డి, దువ్వూరు టీడీపీ అధ్యక్షుడు రాంబాబుతో కలిసి కేసీ కాలువకు నీటి సరఫరా జరిగే రాజోలి వద్ద ఆనకట్ట పరిస్థితులను గమనించారు.

మాధవరాయస్వామి ఉత్సవ బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే, స్థానిక నాయకులు

మైదుకూరురూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధి గాంచిన లక్ష్మీ మాధవ రాయస్వామి ఆలయంలో సంక్రాంతి పండుగ నాడు జరుగు ఉత్సవాలకు సంబంధించి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చేతుల మీదుగా బ్రోచర్ ఆవిష్కరణ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని పుట్టా సుధాకర్ యాదవ్ ఆఫీసులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు మాట్లాడుతూ సంక్రాంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని, అందులో భాగంగా పట్టణంలోని రాయల్ సర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఎమ్మెల్యే చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి సుబ్బరాయుడు, బుజ్జి, బండి తిరుమలేసు, కర్రె పుల్లయ్య, శ్రీను, సుధాకర్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెల ఐదు కాన్పులు జరపాలి

దువ్వూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల 5 కాన్పులు తగ్గకుండా జరపాలని వైద్య శాఖ అధికారి రామలింగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన వైద్యులు, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. సమావేశంలో 40 మంది గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్‌బాబు, వికసిత, హేమలత, రోషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణీలను గుర్తించండి

బద్వేలురూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హైరిస్క్ గర్భిణీలను గుర్తించి మాతృశిశు మరణాలను అరికట్టాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలోని గర్భిణీలందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి వైద్యసేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బాలరాణి, రాజమ్మ, డాక్టర్ విశ్వంత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య పాల్గొన్నారు.